అయినా.. చెత్త కుప్పలే!

అధికారులు హెచ్చరిస్తున్నా మారని పరిస్థితి ● పలు కాలనీల్లో రహదారులపైనే వ్యర్థాలు



మిడిసిటీ కాలనీలో రోడ్డుపై చెత్త తీస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

బండ్లగూడ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రతిరోజు పరిసరాలు శుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి ఇంటికి తిరుగుతూ పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరణ చేస్తున్నారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై పలు కార్యక్రమాలు చేపడుతూ కాలనీల్లోని ప్రజలు ఇళ్లలో నుంచి చెత్తను వీధుల్లో వేయకూడదని పలుమార్లు కార్పొరేషన్ సిబ్బంది అవగాహన కల్పించినా, కొందరు మాత్రం కాలనీలలోని ఉన్న ఖాళీ ప్రదేశాల్లో చెత్త చెదారాలను పడేసి దుర్గంధంగా మారుస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకూడదని పేపర్లలో పలు కథనాలు వెలుడినా, పలు మార్లు అధికారులు హెచ్చరించినా కొందరు జనాలల్లో మాత్రం మార్పు రావడం లేదు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పలు కాలనీలలో రోజు చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఆ చెత్తలో విసిరిన ప్లాస్టిక్ సంచులను తింటున్న వీధికుక్కలు, ఆవులు మరికొన్ని జంతువులు కనిపిస్తున్నాయి. రోడ్డుపై, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను రోజురోజు పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేస్తున్నప్పటికీ మళ్ళీ రోడ్లపై కుప్పలు తెప్పలుగా చెత్త వేస్తున్నారు.



రోడ్డుపై ఉన్న చెత్తలో మూగ జీవులు

కఠిన చర్యలు చేపట్టాలి..

ఇంటింటికి చెత్తను సేకరించే వ్యవస్థ ఉంది. దీనికి నివాసితులకు నెలకుకొంత డబ్బు చెల్లించాలి. అయితే కొంత మంది నివాసితులు ఆ మొత్తాన్ని చెల్లించడానికి ఇష్టపడకుండా తెల్లవారు జామున, రాత్రి సమయంలో చెత్తను రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో పడవేస్తున్నారు. ఇక రోడ్లపై చెత్త వేసే వారిపై కార్పొరేషన్ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోనుంది.

ప్రభుత్వం పథకాలు తెచ్చినా..

ప్రభుత్వం తడి, పొడి చెత్త వేరు చేసేందుకు పలు రకాల పథకాలు ప్రవేశపెట్టినా అమలు కావడంలేదు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రతి ఇంటికి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడానికి నీలం, ఆకుపచ్చరంగు చెత్తబుట్టలు గతంలో అందజేసినా జనాలు పట్టించుకోవడం లేదు.

84 స్వచ్ఛ ఆటోలు..

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేందుకు కార్పొరేషన్‌కు 10 ఆటోలు ఉండగా మరో 74 ప్రైవేటు వాహనాలు వాటి డ్రైవర్లు చెత్తను తరలిస్తున్నారు. స్వచ్ఛ ఆటోకు నిర్ధేశిత రుసుము నెలకు రూ 100 ఖరారు చేసింది. రోడ్డు, వీధులను శుభ్రత తదితర పనులు చేసేందుకు కార్పొరేషన్ పరిధి 172 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు.

కార్పొరేషన్ పరిధిలో 1.50 లక్షల జనాభా..

మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్, దర్గా ఖలీజ్ ఖాన్, హిమాయత్ సాగర్, హైదర్ షాకోట్, బండ్లగూడజాగీర్, పీరంచెరువు, గంధం గూడ, బైరాగి గూడ తదితర ప్రాంతాలు కలిసి ప్రస్తుతం 33,139 నివాసగృహాలు ఉండగా 200 కాలనీలుగా ఏర్పడ్డాయి. జనాభా 1.50 లక్షల వరకు ఉంటుందని అంచనా.

> **ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం..**
>
> 
>
> పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. స్వచ్ఛతలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి. రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్టరిత్య తగు చర్యలు చేపడుతాం. ప్లాస్టిక్ కవర్‌లను వాడకుండా, క్లాత్, పేపర్ బ్యాగులను ప్రజలందరూ వినియోగించాలి. – నరేష్, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ బండ్లగూడ జాగీర్

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



రాజేంద్రనగర్: ఓటరుగా చేరేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించటంతో పోలింగ్ కేంద్రాల వద్దకు వస్తున్న ప్రజలు, ప్రతి బూత్‌లో నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారా లేదా అనే విషయాన్ని జిల్లా కలెక్టర్ శశంక ఆదివారం తనిఖీ చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ పోలింగ్ బూత్‌లో కొనసాగుతున్న ఓటరు నమోదు వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఓటరుగా నమోదుకు యువతకు అవసరమైన సహాయం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌ఓ మల్లయ్య, ఏఈఆర్‌ఓ రవి కుమార్, డీసీ వేణుగోపాల్, డీటీ రవికుమార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చివేత



ప్రహరీని కూల్చివేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మణికొండ: నకిలీ పట్టాలతో ప్రభుత్వ భూమిని కబ్జాకు యత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. నార్సింగి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 205లో ఉన్న ప్రభుత్వ భూమికి తమకు ఇంటి పట్టాలు ఉన్నాయంటూ కొందరు రాజకీయ అండతో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఆ విషయాన్ని ఆదివారం 'సాక్షి' దినపత్రికలో 'ప్రభుత్వ భూమికి ప్రైవేటు ప్రహరీ' అనే శీర్షికన తహసీల్దార్ వివరణతో కథనం ప్రచురించింది. దాంతో గండిపేట తహసీల్దార్ గోవర్ధన్ వెంటనే స్పందించారు. ఆదివారం ఉదయమే రెండు జేసీబీలు ఇద్దరు ఆర్‌ఐ లను పంపి ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ప్రహరీని పూర్తిగా నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షించటమే తమ ధ్యేయమని, వాటి జోలికి ఎవరు వచ్చినా చర్యలు తప్పవన్నారు. కబ్జాలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

హెరిటేజ్ సంపదను కాపాడుకోవాలి



రన్‌లో పాల్గొన్న ఎంపీ, ల్యాంకోహిల్స్ నివాసితులు

మణికొండ: మన చుట్టు పక్కల ఉన్న హెరిటేజ్ సంపదను కాపాడుకోవటంతో పాటు వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ల్యాంకోహిల్స్ నుంచి అనంత పద్మనాభస్వామి దేవాలయం వరకు హెరిటేజ్ రన్–3లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 3 సంవత్సరాలు గా హెరిటేజ్ రన్‌ను నిర్వహిస్తూ ప్రజలను జాగృతం చేస్తున్నామన్నారు. మణికొండ ల్యాంకోహిల్స్ ప క్కన రాతి సంపద ఎంతో ఉందని, అందుకే దాన్ని పురావస్తుశాఖ వారు హెరిటేజ్ ప్రాపర్టీగా గుర్తించారన్నారు. ప్రతి రోజు వాకింగ్, జాగింగ్‌లు చేసి మన ఆరోగ్యాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఇప్పటికే ఎల్లమ్మ చెరువు అభివృద్ధి, ల్యాంకో జీ సర్కిల్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు లింక్ రోడ్లను చేపట్టామన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో తిరిగి పోటీ చేస్తానని తనను ఆశీర్వదించాలని కోరారు. అతిథిగా పాల్గొన్న ఐపీఎస్ అధికారి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శారీరక శ్రమ చేసి చమటను బయటకు తెస్తేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఎల్‌ఐసీ ఇండియా జోనల్ మేనేజర్ ఎల్‌కే శ్యాంసుందర్, ల్యాంకోహిల్స్ సీఈఓ వెంకట్‌రాంరెడ్డి, ల్యాంకోహిల్స్ నివాసితుల సంఘం అధ్యక్షుడు సీఎస్ రెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బి.శ్రీరాములు, కౌన్సిలర్ వసంత రావు, రాష్ట్ర నాయకుడు కె.లక్ష్మణ్‌లతో పాటు అనేక మంది పాల్గొన్నారు. రన్‌ను ఎల్‌ఐసీ ఆధ్వర్యంలో నిర్వహించగా ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు.

ప్రతిష్ఠాపనకు ముస్తాబు



కాషాయ జెండాలతో అలకాపూర్ యోగా సర్కిల్

మణికొండ: అయోధ్యలో నేడు జరిగే బాల రాముడి ప్రతిష్టాపన మహోత్సవాన్ని స్థానికంగా ఘనంగా జరుపుకునేందుకు భక్తులు సిద్ధమయ్యారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని హనుమాన్, శ్రీరాముడు, వేంకటేశ్వర స్వాముల దేవాలయాలను ఇప్పటికే శుద్ధి చేసి అలకంరించారు. ఉదయం నుంచి ఆయా దేవాలయాలలో ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలిసా పఠనాలు, అయోధ్య కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాలను తిలకించటం, బైక్ ర్యాలీలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. మున్సిపాలిటీల పరిధిలోని ముఖ్యకూడలిలలో కషాయ జెండాలను అలంకరించారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న కుమార్‌యాదవ్

అత్తాపూర్: అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కుమార్ యాదవ్‌కు ఉత్తమ సేవా అవార్డు దక్కింది. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి చేతుల మీదుగా ఆయన ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలనే ఉద్దేశంతోనే పోలీసుశాఖలో చేరానన్నాడు. కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా ఎదగటంతో పాటు పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్నతాధికారుల మన్ననలు అందుకునేలా పనిచేశానన్నారు. తన సేవలు గుర్తించి అవార్డుతో సత్కరించిన ఉన్నతాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నార్సింగిలో ఘనంగా మల్లన్న కల్యాణం



నార్సింగిలో మల్లన్నస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



మల్లన్నను దర్శించుకున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం మల్లన్న కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం 8గంటలకు గోపూజ, గణపతిపూజ, మధ్యాహ్నం మల్లన్న కల్యాణోత్సవం, సాయంత్రం 7గంటలకు అగ్నిగుండాలు, 8గంటలకు సొడమ్మకు బోనాలు, రాత్రి 9గంటలకు మల్లన్న ఒగ్గుకథలను నిర్వహించారు. నార్సింగి గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని మల్లన్న, సొడమ్మలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గు కళాకారులు డోలు చప్పుడులు, మంత్రోశ్చరణల మధ్య కన్నుల పండుగగా కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ కొమరవెల్లి మల్లన్న భక్తులు ప్రతి గ్రామంలోను ఉంటారని, వారు స్థానిక దేవాలయాలతో పాటు కొమరవెల్లికి వెల్లి ప్రతి సంవత్సరం మొక్కులు చెల్లించుకుంటారన్నారు. స్థానికంగా అందరి దేవుళ్ల దేవాలయాలను అభివృద్ధి చేసుకుని ఆధ్యాత్మికతను అలవర్చుకుని ప్రశాంతంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, దేవాలయ నిర్వాహకుడు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, బండ్లగూడ మేయర్ మహేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మెన్ రాందాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పీసీసీ సభ్యుడు ముంగి జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మాజీ సర్పంచ్‌లు ప్రసన్న, తలారి మల్లేష్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్, నాయకులు రాము, వినోద్, వేణుగౌడ్‌లతో పాటు మున్సిపాలిటీ వ్యాప్తంగా నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కబ్జా ఆరోపణలు అవాస్తవం



దస్తావేజుల ద్వారా వివరాలు వెల్లడిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్

శంషాబాద్: వాస్తవాలు తెలుసుకోకుండా తనపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్ హెచ్చరించారు. ఓ మహిళకు సంబంధించిన భూమి కబ్జా చేశారని చేసిన ఆరోపణను ఆయన కొట్టిపారేశారు. తాను సర్వేనంబరు 543, 544లో వెయ్యి గజాల స్థలాన్ని కొనుగోలు చేశాను. మహిళ ఆరోపిస్తున్న భూమి సర్వేనంబరు 542లో ఉందన్నారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ గతేడాది మహిళ చేసిన ఆరోపణలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం సదరు స్థల వివాదం కోర్టు పరిధిలో ఉన్నప్పటికి కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడడం ఎంత వరకు సమంజసమన్నారు. అధికార పార్టీ నేతలమంటు భూదందాలు సెటిల్‌మెంట్ దుకాణాలు తెరిచారా అంటు విమర్శించారు. సర్వే పూర్తి చేస్తే ఎవరి భూములు ఎక్కడ ఉన్నాయో తేలుతుందన్నారు. పదవిలో ఉన్న తనపై అడ్డగోలు ఆరోపణలు చేసి పరువు భంగం కలిగించిన వారిపై పరువునష్టం దావా వేయడం ఖాయమన్నారు. పోలీసులు కూడా ఇరువర్గాల దసావేజులు పరిశీలించకుండా ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారని ఆరోపించారు. న్యాయపరిధిలో ఉన్న ఈ విషయాన్ని న్యాయస్థానం ద్వారా తేల్చుకుంటానన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

బండ్లగూడ: మారుతున్న యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్ మాధవినగర్ వెల్ఫేర్ అసోసియేషన్, కామినేని హాస్పటల్స్ సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై వైద్యశిభిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు టెస్టుల చేయించుకోని తమలోని లోపాలను తెలుసుకోని జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ద్వారా దాదాపు 500 మందికి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి మందులను సైతం అందించడం అభినందనీయమన్నారు. రాజు, కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, పార్టీ అధ్యక్షులు సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, పాండు, మార్కెట్ కమిటి డైరెక్టర్లు లక్ష్మిబాయి, నాయకులు హనీఫ్, వెంకటేష్, నరేందర్, చందు, డాక్టర్ సురేష్‌బాబు, బాలేశ్వర్‌రెడ్డి, స్వామిదాసు, జనార్ధన్‌రెడ్డి, నాగేంద్రచారి, శేఖర్‌గౌడ్, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరాజు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగంగా ఉచిత వైద్య పరీక్షలు

అత్తాపూర్: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు టెనెట్ డయాగ్నోస్టిక్ టీం లీడర్ సామల నాగరాజు తెలిపారు. ఆదివారం అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని మేధా రిజాయిస్ అపార్ట్ మెంట్‌లో ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు శ్రద్ధ చూపాలన్నారు. మధుమేహం, రక్తపోటు తదితర ధీర్ఘకాలిక రోగులకు కచ్చితమైన వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలాల్ శ్రీధర్, వనం రమేష్, ఇంద్రకంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లాకు న్యాయం చేయండి



సమావేశంలో పాల్గొన్న సేవ్ రంగారెడ్డి జిల్లా ఉద్యమ సంఘం సభ్యులు

బండ్లగూడ: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు న్యాయం చేయాలని సేవ్ రంగారెడ్డి జిల్లా ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బండ్లగూడలోని విజ్ఞాన్ కళాశాలలో సేవ్ రంగారెడ్డి జిల్లా కోర్ కమిటి సభ్యులు భీమ్‌రెడ్డి అధ్యక్షతన 317 జీవో అమలు వల్ల జిల్లాలో ఉద్యోగులకు జరిగిన అన్యాయం దాని పరిష్కార మార్గాల కోసం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వం జిల్లాలను శాస్త్రీయ విధానమంటూ పాటించకుండా తమకు నచ్చిన విధంగా జిల్లాలను విభజించి స్థానిక ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేసారన్నారు. దీని ఫలితంగా రంగారెడ్డి జిల్లాకు రకరాల సమస్యలు ఏర్పడ్డాయని ముఖ్యంగా ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్ల విషయంలో అలాగే నిరుద్యోగులు శాశ్వతంగా ఉద్యోగాలు కొల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనికి న్యాయమైన శాశ్వత పరిష్కారం ప్రభుత్వం రూపొందించాలన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్య తీవ్రతను తీసుకెళ్తామన్నారు. విశ్రాంత ఉద్యోగులు కె.గోపాల్‌రెడ్డి, చంద్రప్రకాష్‌రెడ్డిలు మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ, ఉద్యోగ, రాజకీయ వర్గాలను కలుపుకోని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా హక్కులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవ్ రంగారెడ్డి జిల్లా కోర్ కమిటి సభ్యులు బి.మధుకర్‌రెడ్డి, బొడ్డు రవి, దర్శన్‌గౌడ్, గనపురం సుధీర్, విజయ్‌కుమార్, మనోరమ, లలిత, సువర్ణ, రాజశేఖర్‌రెడ్డి, బందయ్య, శ్రీనివాస్ రెడ్డి, గణేష్,తదితరులు పాల్గొన్నారు.